తప్పు ఒప్పుకోండి... విచారణ కోరుకోండి

- ఇడి,సిబిఐ, ఐటి, ఎసిబి, సిట్, సిఐడి దర్యాప్తు చేపడతాం
- రూ.లక్ష కోట్లు కొల్లగొట్టేందుకే 'కాళేశ్వరం'
- నిజాం కంటే ధనవంతుడు కావాలన్న దుర్బుద్ధితోనే కెసిఆర్ రీడిజైన్
- తుమ్మిడిహట్టి వద్ద నీటిలభ్యత ఉన్నా మేడిగడ్డకు మార్చారు
- వాస్తవాలు చెప్పినందుకే పిసి ఘోష్ నివేదికపై విషం చిమ్ముతున్న బిఆర్ఎస్
- అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రూ.లక్ష కోట్లు కొల్లగొట్టే దురుద్దేశంతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారని ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి ఆరోపించారు. తప్పు ఒప్పుకోవాలని, విచారణ కోరుకోవాలని కోరారు. వారికి నచ్చిన సంస్థతోనే విచారణ చేయిస్తామన్నారు. ఇడి, సిబిఐ, ఐటి, ఎసిబి, సిట్, సిబిడి వంటి సంస్థలతో దర్యాప్తు చేయిస్తామన్నారు. ఆదివారం అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై పిసి ఘోష్ కమిషన్ నివేదికను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. ఈ సందర్భంగా జరిగిన చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ అబద్ధాలతో సభను, తెలంగాణ సమాజాన్ని తప్పుదోవ పట్టించొద్దని హరీశ్‌రావును కోరారు. ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టుకు తుమ్మిడిహట్టి వద్ద నీటిలభ్యత ఉందంటూ 2014, అక్టోబర్ 24న కేంద్రం అనుమతి ఇచ్చిందన్నారు. నాటి జలశక్తి మంత్రి ఉమాభారతి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారని గుర్తు చేశారు. 205 టిఎంసిల నీరు అందుబాటులో ఉందంటూ లేఖ రాస్తే నాటి నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు మళ్లీ పరిశీలించాలంటూ కేంద్రానికి లేఖ రాశారని వివరించారు. ఎమ్మెల్యేగా ప్రమాణం చేశాక తిరిగి ఎన్నుకోవాలంటూ ప్రజల వద్దకు వెళ్తామా? అని అడిగారు. 2009 జులై 18న 236.5 టిఎంసీల నీరు అందుబాటులో ఉందంటూ ఉమ్మడి ఎపి ప్రభుత్వానికి కేంద్రం లేఖ రాసిందన్నారు. ఈ రికార్డులను గత ప్రభుత్వం కావాలనే తొక్కి పెట్టిందని విమర్శించారు. పిసి ఘోష్ కమిషన్ ఈ వాస్తవాలతో నివేదిక ఇచ్చిందనే ఈ కమిషన్‌పై బిఆర్ఎస్ విషం చిమ్ముతోందన్నారు. హరీశ్‌రావు తప్పు చేశారంటూ ఆ నివేదికలోని పేజీ నెంబర్ 98లో స్పష్టంగా ఉందని తెలిపారు. కావాలనే చర్చను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. ఏం విచారణ కావాలో కోరుకోవాలన్నారు. అసంపూర్తి సమాచారంతో సభను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన హరీశ్‌రావు వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కోరారు. విద్యాసాగర్‌రావు బతికుంటే ఈ అబద్ధాలు వినలేక కాళేశ్వరంలో దూకి ఆత్మహత్య చేసుకునే వారని అన్నారు. మహారాష్ట్ర ప్రభుత్వం తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు కట్టొద్దంటూ ఎప్పుడూ చెప్పలేదని తెలిపారు. ఎత్తును 152 మీటర్లు కాకుండా 148 మీటర్లు కట్టాలని సూచించిందన్నారు. నిజాం కంటే ధనవంతుడు కావాలన్న దుర్బుద్ధితో కెసిఆర్ ప్రాజెక్టుకు రీడిజైన్ చేశారన్నారు. మేడిగడ్డ వద్ద కట్టాలని కెసిఆర్, హరీశ్‌రావు ముందే నిర్ణయించాక రిటైర్డ్ ఇంజనీర్ల కమిటీని నియమించారని వివరించారు. ఆ నివేదిక వారికి అనుకూలంగా లేదని భావించి దాన్ని తొక్కిపెట్టి అనుకున్న చోట ప్రాజెక్టును కట్టారని అన్నారు. ఆ నివేదికను మాయం చేశారని విమర్శించారు. తుమ్మిడిహట్టి వద్ద ఇచ్చిన హెచ్చరిక మేడిగడ్డ వద్ద కూడా ఉందన్నారు. దీన్ని శిక్షించాల్సి వస్తే వారిని ఉరి తీయాలి కదా? అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు అన్యాయం జరుగుతుందనే కదా తెలంగాణ తెచ్చుకుందని పేర్కొన్నారు. ఏనుగులను తినేవాళ్లు పోయారనుకుంటే పీనుగులను తినేవాళ్లు వచ్చారని, ఇప్పటికీ హరీశ్‌రావు మొండివాదనకు దిగుతున్నారని విమర్శించారు ఇప్పటికైనా ఏ విధమైన విచారణ కావాలో హరీశ్‌రావు చెప్పాలని కోరారు.

అసెంబ్లీలో పిసి ఘోష్ నివేదికను చూపుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

ఘోష్ కమిషన్ నివేదిక చిత్తుకాగితం

- ఇది కక్షసాధింపు చర్యల్లో భాగమే
- వరదల్లో కాంగ్రెస్ బురద రాజకీయం
- అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిసి ఘోష్ కమిషన్ నివేదిక డొల్ల అని, ఒక చిత్తు కాగితమని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎమ్మెల్యే టి హరీశ్‌రావు విమర్శించారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ నివేదిను రూపొందించారని అన్నారు. ఆదివారం అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై పిసి ఘోష్ కమిషన్ నివేదికపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో ప్రజలు అనేక బాధలు పడుతున్నారన్నారు. ఈ సమయంలో కాంగ్రెస్ ప్రభుత్వం బురద రాజకీయం చేస్తోందని విమర్శించారు. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ యాక్టు-1952 ప్రకారం నోటీసులు ఇవ్వకుండా, నిబంధనలు పాటించకుండా ఈ నివేదికను ఘోష్ కమిషన్ రూపొందించిందన్నారు. చట్టబద్ధంగా విచారణ జరగనందునే హైకోర్టును ఆశ్రయించామని తెలిపారు. మాజీ సిఎం కెసిఆర్‌కు, తనతోపాటు అధికారులకు 8 బి ప్రకారం నోటీసు ఇవ్వకుండా కమిషన్లు ఇచ్చే నివేదికలు చిత్తు కాగితంతో సమానమని వ్యాఖ్యానించారు. గతంలో కోర్టులిచ్చిన తీర్పులను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఎమర్జెన్సీ విధించినందుకు మాజీ ప్రధాని ఇందిరా గాంధీపై వేసిన షా కమిషన్‌పై ఆమె, లిబర్ హాన్ కమిషన్‌పై బిజెపి నేత ఎల్‌కె అద్వానీ కోర్టుకు వెళ్లారని వివరించారు. వారు కోర్టుకెళ్తే ఒప్పు, తాము న్యాయస్థానానికి వెళ్తే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. 660 పేజీల ఘోష్ కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ పెట్టకుండా ఆపాలంటూ తాను కోర్టును ఆశ్రయించలేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అడ్వకేట్ జనరల్ ద్వారా పిటిషన్‌ను తెప్పించుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం విచారణ జరగనందున ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలంటూ కోర్టును కోరామన్నారు. తాము సుప్రీంకోర్టుకు వెళ్తే ఆ నివేదిక క్వాష్ అవుతుందనే ఆందోళనతోనే సిఎం రేవంత్‌రెడ్డి కేవియట్ పిటిషన్ దాఖలు చేశారని, ఆదరాబాదరగా ఆదివారం అసెంబ్లీలో చర్చకు పెట్టారని విమర్శించారు. పిసి ఘోష్ కమిషన్ తమ హక్కులను కాలరాసిందన్నారు. విచారణను ఎదుర్కొనే పౌరులు, నాయకులు, అధికారులకు హక్కులుంటాయని వివరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

వలస కార్మికుల చట్టాన్ని అమలు చేయాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా పరిధిలో పనిచేస్తున్న లక్షల మంది వలస కార్మికులకు కనీస వేతనాలు అందేలా 1979 అంతర్రాష్ట్ర కార్మికుల చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయా సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. జిల్లాలో కంపెనీ యాజమాన్యాలు కార్మికులతో వెట్టి చాకిరి చేయించుకుని కనీస వేతనాలు కూడా ఇవ్వడం లేదని అన్నారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా కాటేదాన్‌లోని సిఐటియు కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందన్నారు. 29 కార్మిక చట్టాన్ని రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చిందని విమర్శించారు. పారిశ్రామిక ప్రాంతంలో జరిగే ప్రమాదాల్లో కార్మికులు చనిపోతున్నారని, గాయాలపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అయినా కార్మిక శాఖ అధికారులు వారిని పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం అలాగే స్కీమ్ వర్కర్లను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం చంద్రమోహన్, ఉపాధ్యక్షులు జె రుద్రకుమార్, కోశాధికారి కవిత, ఉపాధ్యక్షులు డి కిషన్, డి జగదీష్, నర్సిరెడ్డి, అల్లి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఒపిఎస్ పునరుద్ధరణ కోసం అలుపెరుగని పోరాటం

- సోమ, మంగళ వారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం : రఘునందన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పాత పెన్షన్ పథకం పునరుద్ధరణ కోసం అలుపెరుగని పోరాటం చేస్తామని ఎఐఎన్‌పిఎస్ఇఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాచన రఘునందన్ డిమాండ్ చేశారు. సోమ, మంగళవారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భారత ఉప రాష్ట్రపతి పదవికి ఇటీవల రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్ సైతం పెన్షన్ కోసం అర్జీ పెట్టడం దేశ వ్యాప్తంగా ఉద్యోగ శ్రేణుల్లో చర్చనీయాంశం అవుతున్నదన్నారు. దీనిని బట్టే వృద్ధాప్యంలో పెన్షన్ ఎంత ఆవశ్యకమనే విషయం అవగతమవుతున్నదని తెలిపారు. దేశ వ్యాప్తంగా కోటి మందికిపైగా..ఉద్యోగులు కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్‌లో ఉన్నారని రఘునందన్ చెప్పారు. 2004 సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఉమ్మడి అంధ్రప్రదేశ్‌లో భాగస్వామ్య పెన్షన్ పథకం అమలవుతున్నదన్నారు. ఉద్యోగమంటేనే వ్యక్తికి భద్రత అన్నారు. సిపిఎస్‌లో ఉన్న ఉద్యోగికి అర్థిక భద్రత తో పాటు సామాజిక భద్రత కూడా లేదని అవేదన వ్యక్తం చేశారు.

సిడబ్ల్యుసి అనుమతి లేకుండానే మేడిగడ్డ నిర్మాణం

- కథ,స్క్రీన్‌ప్లే,డైరెక్షన్ అన్నీ కెసిఆరే
- డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా నిర్ణయాలు
- పిసి ఘోష్ కమిషన్ ఇదే తేల్చింది
- రూ.1.47 లక్షల కోట్ల ప్రజాధనం వృథా
- అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదిక ప్రవేశపెట్టిన మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజెక్టుకు కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ అన్నీ కేసీఆరేనని కాళేశ్వరం న్యాయవిచారణ కమిషన్ తేల్చిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు. సిఎం హోదాలో కెసిఆర్ ఇంజనీర్‌లా వ్యవహరించి సాంకేతిక అంశాల్లో జోక్యం చేసుకున్నారని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ రిపోర్టుపై ఆదివారం స్పీకర్ బి ప్రసాద్‌కుమార్ అసెంబ్లీలో చర్చకు అనుమతిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్, కాళేశ్వరం ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియా అన్నీ కెసిఆరే, మేడిగడ్డ అయన వ్యక్తిగత నిర్ణయమని అన్నారు. సిడబ్ల్యుసి అనుమతి లేకుండానే కాళేశ్వరం ప్రారంభించినట్టు కమిషన్ నివేదికలో పేర్కొందన్నారు. "ఉద్దేశ్యపూర్వకంగానే కాళేశ్వరం నిర్మించారని కమిషన్ నివేదిక ఇచ్చింది. మూడు ప్రాజెక్టుల్లో సరైన నిర్వహణ లేదు.నిర్లక్ష్యంగా, అక్రమంగా, అసంబద్ధంగా ప్రాజెక్టు కట్టారని కమిషన్ చెప్పింది. ప్లానింగ్, డిజైన్లు, నిర్వహణలోనూ విఫలమైంది. తీవ్రమైన లోపాలున్నాయి. కెసిఆర్ నియమించిన రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ ఇచ్చిన నివేదికను సైతం కెసిఆర్ బేఖాతరు చేశారు. తొందరపాటు ఆమోదాలతో ప్రాజెక్టుకు నష్టాలు వచ్చాయి. కెసిఆర్ చెప్పినట్టే చేశామని అధికారులు వాంగ్మూలం ఇచ్చారు. నిబంధనలను ఉల్లంఘించి కాంట్రాక్టర్లకు మేలు చేశారు. అనుమతులు రాకుండానే కాంట్రాక్టర్లకు పనులు అప్పగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడట్లేదు.ప్రాజెక్టుల్లో రాజకీయ జోక్యం, నిర్లక్ష్యం ఉంది. మార్గదర్శకాలకు విరుద్ధంగా నిర్మాణాలకు బడ్జెట్ విడుదల చేశారు. ప్రాజెక్టు అంచనా వ్యయం పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా భారీ నష్టం జరిగిందని' అన్నారు. రూ. 38,400 కోట్లతో ప్రాణహితను చేపడితే, కాళేశ్వరాన్ని రూ.1.47 లక్షల కోట్లకు పెంచారని చెప్పారు. బిఆర్ఎస్ హయాంలోనే రాష్ట్రానికి పూర్తి నష్టం జరిగింది. కాళేశ్వరం అక్రమాలకు పూర్తిబాధ్యత కెసిఆర్‌దేనని కమిషన్ తేల్చింది. ఆయనపై చర్యలు తీసుకోవాలని కమిషన్ సూచించింది. కెసిఆర్‌పై చట్ట ప్రకారం తగిన చర్య తీసుకునే స్వేచ్ఛ సర్కార్‌కు ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.

తేడా లేదు

డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా ప్రాజెక్టు పనులు చేశారని ఎన్‌డిఎస్ఎ నివేదికలో ఉందని మంత్రి విమర్శించారు. మేడిగడ్డలో పూర్తి నీరు నిల్వ చేసి కూలిపోయేందుకు కారణమయ్యారని పేర్కొన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రూ. 87,449 కోట్లతో చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టు కాళేశ్వరం, కానీ మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిరుపయోగంగా మారాయి, ప్రాణహిత-చేవెళ్లకు పేరు మార్చి కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు గుండెకాయలాంటి మేడిగడ్డ దెబ్బతింది. మూడు బ్యారేజీలు 20 నెలలుగా నిరుపయోగంగా మారాయి.

20.2 టిఎంసిలే లిఫ్ట్ చేశారు

కాళేశ్వరం నుంచి ఏడాదికి 20.2 టిఎంసిలు మాత్రమే లిఫ్ట్ చేశారని, బ్యారేజీలకు జరిగిన నష్టం రాష్ట్రానికి పెనుభారంగా మారిందని మంత్రి తెలిపారు. రూ. లక్ష కోట్లు ఖర్చుచేసినా లక్ష ఎకరాలకూ నీరు ఇవ్వలేదన్నారు. తుమ్మిడిహట్టి దగ్గర నీళ్లు ఉన్నాయని కేంద్ర మంత్రి ఉమాభారతి లేఖ రాసినా కెసిఆర్, హరీష్‌రావు పట్టించుకోలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక ఇలాంటి విపత్తు ఏ రాష్ట్రంలోనూ జరగలేదన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగినప్పుడు బిఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉందన్నారు. ఎన్‌డిఎస్ఎ బిఆర్ఎస్ నేతలు ఇష్టమెచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బిల్లు తెచ్చినప్పుడు బీఆర్ఎస్ మద్దతిచ్చిందని' అని ఉత్తమ్‌కుమార్ వివరించారు.

ఆంగ్లం, తెలుగులో కమిషన్ సారాంశం

అసెంబ్లీలో కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ నివేదికలోని ముఖ్యాంశాల కాపీలను ఆంగ్లం, తెలుగులో సభకు సమర్పించారు. ముందు సభలో నివేదికను టేబుల్ చేసినప్పుడు సభ్యులకు పెన్‌డ్రైవ్‌లో పూర్తి వివరాలు అందజేశారు. సాయంత్రం 4.30 గంటలకు స్పీకర్ ప్రసాద్‌కుమార్ చర్చకు అనుమతించారు. 38 పేజీలతో కాళేశ్వరం నివేదిక తెలుగు సారాంశం, 25 పేజీల్లో ఇంగ్లీషు సారాంశం కాపీలను సభకు మళ్లీ అందించారు. గ్యాలరీలో మీడియాకు కూడా అవే ఇచ్చారు.

వాగ్వివాదం

సభలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పీసీ ఘోష్ కమిషన్ నివేదిక సారాంశాన్ని సభకు వివరిస్తుండగానే కాంగ్రెస్, బిఆర్ఎస్ సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. ఉత్తమ్ ప్రసంగాన్నీ పదే పదే హరీష్‌రావు, కెటిఆర్, ఇతర సభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. అలాగే కమిషన్ మాజీ సిఎం కెసిఆర్, హరీష్‌రావును తప్పుబట్టిన అంశాలను మంత్రి సభలో ప్రస్తావిస్తున్నప్పుడు కాంగ్రెస్ సభ్యులు షేమ్ షేమ్ అని అన్నారు. స్పీకర్ పలుమార్లు జోక్యం చేసుకోవాల్సి వచ్చింది. అసెంబ్లీ వ్యవహారాల మంత్రి డి శ్రీధర్‌బాబు సైతం హరీష్‌రావు, బిఆర్ఎస్ సభ్యుల వైఖరిని తప్పుబట్టారు.

సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

స్థానిక సమస్యలపై నేడు, రేపు ధర్నాలు

- 10 నుంచి తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాలు :జూలకంటి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

స్థానిక సమస్యల పరిష్కారం కోసం నేడు, రేపు (సోమవారం, మంగళవారం) ఉమ్మడి జిల్లాలోని అన్ని మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహించనున్నట్టు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి తెలిపారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో, పట్టణాల్లో ప్రజాప్రతినిధులు లేకపోవడంతో అభివృద్ధి కుంటుపడిందన్నారు. సమస్యలతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతుండటంతో సిపిఎం ఆధ్వర్యంలో అనేక గ్రామాలు, పట్టణాల్లో అధ్యయన యాత్రలు నిర్వహించామని తెలిపారు. ఈ యాత్రలో వచ్చిన సమస్యలను పరిష్కరించేలా అధికారులపై ఒత్తిడి తెచ్చేందుకు ధర్నాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. స్థానిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రాల్లో జరిగే ధర్నాలకు అన్ని వర్గాల ప్రజలు మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు. పీడిత ప్రజల కోసం నాడు జరిగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రను ప్రజలందరికీ తెలిపేలా ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, వన్ టౌన్ కార్యదర్శి డాక్టర్ మల్లు గౌతమ్‌రెడ్డి, మండల కార్యదర్శులు రవినాయక్, వినోద్‌నాయక్, జిల్లా కమిటీ సభ్యులు రెమిడాల పరుశరాములు, అయ్యూబ్, నాయకులు పాల్గొన్నారు.

యూరియా కోసం రోడ్డుపై పడిగాపుల కాస్తున్న రైతులు

యూరియా కోసం రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యూరియా కోసం ములుగు జిల్లా గోవిందరావుపేట మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎదుట 163వ జాతీయ రహదారిపై రైతులు రాస్తారోకో నిర్వహించారు. స్థానిక పోలీసులు రైతులతో చర్చించేందుకు ప్రయత్నించడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. మీరు రైతులైతే.. తమకు పంట పొలాలు ఉంటే రైతు బాధ ఏంటనేది అర్థమవుతుందంటూ రైతులు పోలీసుల ఎదుట తమ మనోవేదనను వెలిబుచ్చారు. యూరియా కొరతకు కారణం ఏదైనా.. ప్రస్తుతం రైతులు పడుతున్న బాధలు వర్ణనాతీతమని, ఇందుకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని రైతులు ఆరోపించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రాబోయే రోజుల్లో మరిన్ని ఉద్యమాలు చేస్తామని రైతులతోపాటు రైతు సంఘాల నాయకులు హెచ్చరించారు. పోలీసులు సర్ది చెప్పడంతో రైతులు రాస్తారోకోను విరమించారు.

ఎటువంటి మార్పుకైనా.. గ్రామీణ ప్రాంతాల్లోనే ఉద్యమం ప్రారంభం

- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో ఎటువంటి మార్పు జరగాలన్న గ్రామీణ ప్రాంతాల్లోనే ఉద్యమం ప్రారంభం అవుతుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు. ఆదివారం వికారాబాద్ జిల్లా తాండూరు మండలం జినగుర్తి గ్రామంలో ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సందీపని గురుకులం నూతన భవనాన్ని కేంద్ర మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ.. దేశం అభివృద్ధి చెందాలంటే దేశ వ్యవస్థ ఇతరులపై ఆధారపడకుండా దేశంలోనే సమృద్ధి అయ్యేలా స్వరాజ్యం ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. మన దేశం ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలవాలంటే.. అందుకు ఏకలవ్య గురుకులాల ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. తెలంగాణలో హైదరాబాద్ పారిశ్రామికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందడం అభినందనీయమని కొనియాడారు. పాఠశాలల్లో యోగాను అమలు చేయాలని, దీనివల్ల శారీరక, మానసిక ఆరోగ్యంతో జీవించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్, విశ్రాంత ఐఎఎస్ అధికారి, రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ చైర్మన్ (జమ్మూ అండ్ కాశ్మీర్) సతీష్ చంద్ర, జిల్లా ఎస్‌పి నారాయణరెడ్డి, ఏకలవ్య గ్రామీణ వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు భాగయ్య, చైర్మన్ పి.వెంకటేశ్వరరావు,సందీపని గురుకులం చైర్మెన్ మల్లారెడ్డి, ఎస్‌బిఐ చీఫ్ జనరల్ మేనేజర్ రాధాకృష్ణన్ పాల్గొన్నారు.

ఇందిరమ్మకు పైసల కష్టాలు

- డబ్బుల్లేక ఇళ్లు కట్టలేని పేదలు
- ఆగస్టులో ప్రారంభించకపోతే రద్దు చేస్తామంటూ హెచ్చరిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఇందిరమ్మ' పథకం కింద ఇళ్లు కట్టుకునేందుకు లబ్దిదారులు డబ్బుల్లేక సతమతమవుతున్నారు. అర్హులైనా పునాదులు తీసేందుకే డబ్బులు లేక ఎంతోమంది వదులుకుంటున్న పరిస్థితి. ఇండ్లులేని పేదలందరికీ ఇళ్లు కట్టిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రారంభించిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా పాలనలో స్వీకరించిన దరఖాస్తుల్లో అర్హుల్ని గుర్తించి ఇళ్లు మంజూరు చేసింది. పెరిగిన నిర్మాణ వ్యయం, ఆర్థిక స్థోమతలేని పేదరికంతో చాలా మంది లబ్దిదారులు ఇంటి నిర్మాణం చేపట్టలేకపోతున్నారు. మొదట ఇంటి నిర్మాణంలో పునాది తవ్వకం, బేస్‌మెంట్ నిర్మాణం, మట్టి పనులకు రూ. రెండు లక్షల ఖర్చువుతున్నందున పేద లబ్దిదారులు ముందుకు రావట్లేదు. అప్పులు చేసి ఇంటి నిర్మాణం చేసినా బిల్లులు రాకపోతే వీధిన పడతామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద లబ్దిదారులకు ఇంటి నిర్మాణం కోసం స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ద్వారా రూ. రెండు లక్షల వరకు రుణాలిస్తామని ప్రభుత్వం చెప్పినా ఆచరణకు నోచట్లేదు. ఎస్‌హెచ్‌జీల్లో సభ్యులు కాని వాళ్లకు రుణాలిచ్చే ఛాన్స్ లేదు. దాంతో చాలా మంది లబ్దిదారులు తాము ఇంటిని కట్టుకోలేకపోతున్నామని, ప్రభుత్వమే ఇంటిని కట్టించాలని కోరుతున్నారు. పైగా 600 చదరపు అడుగుల స్థలంలోనే 45 రోజుల గడువులో ఇంటి నిర్మాణం పూర్తి చేయాలని, లేదంటే రద్దు చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో 25 శాతం మంది చేతులెత్తేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాదిలో 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఇప్పటికే మూడు లక్షల ఇళ్లను మంజూరు చేసి లబ్దిదారులకు ప్రొసీడింగ్స్ అందజేసింది. రాష్ట్రంలో 80.05 లక్షల మంది పేదలు ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేశారు. దరఖాస్తుల్ని పరిశీలించిన ప్రభుత్వం 77.19 లక్షల మందిని యాప్‌లో అప్‌లోడ్ చేసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో 7,53,668 మంది ఇందిరమ్మ ఇండ్ల కోసం దరఖాస్తు చేశారు. వీటిని పరిశీలించి ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3500 ఇండ్ల చొప్పున 40,555 ఇళ్లను మంజూరు చేశారు. సంగారెడ్డి జిల్లాలో 16,555, మెదక్ జిల్లాలో 9000, సిద్దిపేట జిల్లాలో 15,000 ఇండ్లను మంజూరు చేశారు. మిగతా వాళ్లకు దశల వారీగా మంజూరు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. లబ్దిదారులకు ఇళ్లను మంజూరు చేసే ప్రక్రియ జరిగినప్పటికీ ఇళ్ల నిర్మాణం మాత్రం ముందుకు సాగట్లేదు. ముందస్తుగా లబ్దిదారులే సొంత డబ్బులతో బేస్‌మెంట్ లెవల్ వరకు నిర్మాణం చేసుకున్న తర్వాతనే ప్రభుత్వం బిల్లు చెల్లిస్తుంది. దాంతో ఆర్థిక స్థోమతలేని పేద లబ్దిదారులు ఇంటి నిర్మాణ పనుల్ని మొదలు పెట్టట్లేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఆర్థిక సహకారం అందించాలని లబ్దిదారులు కోరుతున్నారు.

ప్రారంభం కాని 25 శాతం ఇండ్ల నిర్మాణం

ఉమ్మడి మెదక్ జిల్లాలో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లలో ఇప్పటి వరకు 25 శాతం వరకు నిర్మాణ పనులు ప్రారంభంకాలేదు. సంగారెడ్డి జిల్లాకు 16,555 ఇళ్లు కేటాయించగా అందులో 14,529 ఇండ్లను మంజూరు చేశారు. వీటిల్లో ఇప్పటి వరకు 6450 ఇండ్లకు మార్కింగ్ చేశారు. 1850 ఇళ్ల వరకు బేస్‌మెంట్ లెవల్లో ఉన్నాయి. 120 ఇండ్ల నిర్మాణం రూఫ్‌లెవల్లో ఉండగా మరో 50 ఇళ్లు స్లాబ్ లెవల్లో ఉన్నాయి. మంజూరైన ఇండ్లల్లో కేవలం 8470 మాత్రమే నిర్మాణ పనులు ప్రారంభమై వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకా 5737 ఇళ్ల నిర్మాణ పనులు ఇంత వరకు ప్రారంభించలేదు. అందులో 3791 మంది లబ్దిదారులు ఆర్థిక స్థోమత బాగలేకపోవడంతో ఇళ్ల నిర్మాణానికి ఆసక్తి చూపట్లేదని గృహ నిర్మాణ శాఖ గుర్తించినట్టు అధికారులు చెబుతున్నారు. మంజూరైన లబ్దిదారుల్లో 25 శాతం మంది తమ వద్ద డబ్బుల్లేక పోవడం వల్లే ఇంటి నిర్మాణం చేసుకోలేకపోతున్నామని చెబుతున్నారు.

క్షేత్ర స్థాయిలో 'నవతెలంగాణ' పరిశీలన..

చౌటకూర్ మండల కేంద్ర గ్రామంలో 26 ఇళ్లు మంజూరు కాగా, 18 మంది లబ్దిదారులు మాత్రమే నిర్మాణ పనులు మొదలుపెట్టారు. ఇందులో 11 బేస్‌మెంట్ లెవల్లో ఉండగా ఐదు మాత్రం లెంటల్ లెవల్లో, మరో 2 స్లాబ్ లెవల్లో ఉన్నాయి. మరో ఎనిమిది మంది లబ్దిదారులు పైసల్లేక నిర్మాణ పనులు ప్రారంభించలేదు. ఆ ఎనిమిది మంది లబ్దిదారులు ఇంటిని నిర్మించుకోలేకపోతున్నామన్న విషయాన్ని రాత పూర్వకంగా తెలపాలని అధికారులు చెబుతున్నారు. సదాశివపేట మండలం ఆరూరు గ్రామంలో 50 ఇండ్లు మంజూరయ్యాయి. వీటిల్లో 24 మాత్రమే నిర్మాణ పనులు జరుగుతున్నాయి. 11 ఇళ్ల నిర్మాణ పనులు ఇంత వరకు ప్రారంభించలేదు. మరో 15 మంది లబ్దిదారులు మేం ఇండ్లు కట్టుకోలేకపోతున్నామని పంచాయతీ కార్యదర్శికి చెప్పారు. ఏటిగడ్డసంఘం గ్రామంలో 34 ఇండ్లు మంజూరవ్వగా 7 ఇండ్ల నిర్మాణం కోసం మార్కింగ్ చేయగా ఆరు చోట్ల మాత్రమే పనులు జరుగుతున్నాయి. రెండు ఇళ్లకు బేస్‌మెంట్ లెవల్లో బిల్లులిచ్చారు. మిగతా ఇండ్ల నిర్మాణం మొదలుపెట్టలేదు. పైగా నాలుగు లబ్దిదారులు మాత్రం డబ్బుల్లేనందన ఇంటి నిర్మాణం తమ వల్ల కాదని చెబుతున్నారు. సిద్దిపేట జిల్లాలో 15 వేల ఇండ్లు మంజూరు చేశారు. వీటిల్లోనూ ఆరు వేల ఇళ్ల నిర్మాణం ఇప్పటికీ మొదలుకాలేదు. రాయపోల్ మండలంలోని రామారంలో 183 ఇండ్లు మంజూరవ్వగా 17 మాత్రమే పనులు నడుస్తున్నాయి. 90 మంది లబ్దిదారులు ఇంటి నిర్మాణం చేపట్టలేమని తేల్చి చెప్పారు. మరో 76 మంది లబ్దిదారులు పునాది తవ్వే పనులు కూడా మొదలుపెట్టలేదు. చిన్నకొడూరు మండల కేంద్రంలో 521 ఇండ్లు మంజూరవ్వగా 300 ఇండ్లు మాత్రమే నిర్మాణమవుతున్నాయి. 221 ఇళ్ల నిర్మాణ పనులు ఇప్పటికీ ప్రారంభించలేదు. మెదక్ జిల్లాలోనూ తొమ్మిది వేల ఇళ్లను మంజూరు చేయగా వీటిల్లో 3500 వరకు పనులు మొదలు పెట్టలేదు.

అలవిగాని ఆంక్షలు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వం అలవిగాని ఆంక్షలు పెట్టింది. 600 చదరపు అడుగుల్లోనే ఇంటిని కట్టుకోవాలని చెప్పడం వల్ల పెద్ద కుటుంబం ఉన్న వాళ్లు ఇష్టపడట్లేదు. 45 రోజుల వ్యవధిలోనే స్లాబ్ పడిపోవాలని, లేదంటే బిల్లులు మంజూరవ్వబోవని చెబుతున్నారు. గ్రామాల్లో మేస్త్రీలు, ఇసుక, మట్టి లభించట్లేదు. సిమెంట్, ఐరన్ ధరలు పెరగడం వల్ల ఇబ్బందులున్నాయి. మరో పక్క ఆగస్టులోపు నిర్మాణ పనుల్ని ప్రారంభించకపోతే ఇంటిని రద్దు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. తక్కువ సమయంలో లక్షలు తెచ్చి ఎట్లా నిర్మాణ పనులు చేపడతామని బైరు జయమ్మ, గొల్ల విజయలక్ష్మితో పాటు బూడిద బూమయ్య, ఎంకపల్లి హైమద్, పెద్దగొల్ల రాములు పేర్కొన్నారు. డ్వాక్రా సంఘం నుంచి ప్రతి లబ్దిదారునికి రూ.2 లక్షల ఇవ్వాలని కోరుతున్నారు.

కాళేశ్వరంను కామధేనువులా వాడుకున్న కెసిఆర్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ సిఎం కెసిఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును కామధేనువుగా వాడుకున్నారని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఉదయం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వారు మాట్లాడారు. రూ.30 వేల కోట్ల బడ్జెట్‌తో కాళేశ్వరం ప్రాజెక్టును ప్రారంభించి రూ.లక్ష కోట్లు దోచుకున్నారన్నారు. బిఆర్ఎస్ అవినీతి, అక్రమాలతో తెలంగాణ ఆత్మగౌరవం ఎప్పుడో పోయిందని ఆరోపించారు. కోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ వేసి కాళేశ్వరంపై చర్చ జరగకుండా చేసే ప్రయత్నం చేశారని, చివరకు కమిషన్‌ను కూడా తప్పు పడుతున్నారన్నారు. కాళేశ్వరం జాతి సంపద అని, నివేదికపై అసెంబ్లీలో తప్పకుండా చర్చ జరుగుతుందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికలో తప్పు ఎవరు చేశారో తేలితే వ్యక్తులెవరైనా ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. యూరియా కొరతపై కావాలనే రచ్చ చేస్తున్నారన్నారు. తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉంటే కేంద్రం అందుకు తగ్గట్టు ఇవ్వడం లేదని తెలిపారు. యూరియా ఇచ్చేది కేంద్ర ప్రభుత్వం అని, కేంద్రాన్ని అడగడానికి బిఆర్ఎస్ నేతలకు నోరు రావడంలేదని అన్నారు. రైతాంగంపై చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీ వెళ్లి యూరియా కోసం కేంద్ర ప్రభుత్వం మీద ధర్నా చేయాలని డిమాండ్ చేశారు.

కాళేశ్వరం భయంతోనే యూరియా నినాదం : ఎమ్మెల్యే నాయిని

కాళేశ్వరం ప్రాజెక్టు నివేదికపై భయంతోనే బిఆర్ఎస్ నేతలు యూరియా నినాదం ఎత్తుకున్నారని వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం వారు అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. ఇద్దరు, ముగ్గురు కలిసి కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో దోచుకుని తిన్నారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఎస్టిమేషన్ ఎంత..? ఎంత వరకు తీసుకెళ్లారు..? అనే విషయం, వాస్తవాలు ప్రజలకు తెలియాలని తెలిపారు. ఈ బీఆర్ఎస్ దొంగలు రాష్ట్రాన్ని ఎలా దోచుకున్నారో ప్రజలకు తెలియాలని, దీనిపై సభలో చర్చ జరుగుతుందని అన్నారు. శనివారం వరంగల్‌కు చెందిన బాలు నాయక్ అనే రైతుకు యూరియా వచ్చినప్పటికీ బిఆర్ఎస్ దొంగలు కావాలని ఆ రైతుతో పత్తిని చేను నుంచి తీయించి ధర్నా చేయించారని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE II SENIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S.No. 286 OF 2015
BETWEEN :
K. Prashanth Kumar,rep.by his power of attorney K.Sham Kumar ...**PLAINTIFF**
AND
Mr. Badri Hemanth Kumar & others ...**DEFENDANTS**
To
1. Mr.Badri Hemanth Kumar R/o Flat No. 101, Road No.1, Sp Residency, Panchavathi Colony, Medipally, Ghatkesar, Ranga Reddy Dist.
2. Mr.Nakka Venkat Mahesh , R/o Flat No.G3, Sp Residency, Panchavathi Colony, Medipally, Ghatkesar, Ranga Reddy Dist.
3. M/s. Toshani Software Solutions, A regd. Partnership Firm, Rep. by Mr.Badri Hemanth Kumar , R/o Flat No. 101, Road No.1, Sp Residency, Panchavathi Colony, Medipally, Ghatkesar, Ranga Reddy Dist.
...**DEFENDANTS**
Please take notice that the above suit **OS No.286 of 2015** filed for recovery of amounts from you. The above suit is posted on **10-9-2025** for your appearance or through your Advocate if any in the said Court at **10:30 a.m.** if you fail to attend the above Court on the said date mater will be decided in your absence.
(BY ORDER OF THE COURT)
SRIKANTH HARI HARAN
ADVOCATE
Office at 1-1-336/35, Vivek Nagar, Chikkdapally, Hyderabad.

హైదరాబాద్‌లో నేడు పాత పెన్షన్ సాధన పోరాట సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉద్యోగ జెఏసి ఆధ్వర్యంలో పాత పెన్షన్ సాధన పోరాట సభ సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు హైదరాబాద్‌లోని వీఎస్టీ దగ్గర ఆర్‌టిసి కళాభవన్‌లో జరగనుంది. అన్ని జిల్లాల జెఏసి నాయకులు సోమవారం తరలివచ్చి సభను జయప్రదం చేయాలని ఉద్యోగ జెఏసి చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు కోరారు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను పునరుద్ధరిస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. ఆ హామీని నిలబెట్టుకోవాలని కోరారు.

బిసి రిజర్వేషన్ల వర్గీకరణ చేయాలి

- రజక వృత్తిదారుల సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అసెంబ్లీలో ఆదివారం ప్రవేశపెట్టిన 42 శాతం బిసి బిల్లు జిఒలో వర్గీకరణ ఊసే లేకుండా ఉండడం అన్యాయమని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ల ఆశయ్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కామారెడ్డి బిసి డిక్లరేషన్‌లో 42 శాతంతో పాటు ఉప వర్గీకరణ చేపడతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. శాసనసభలో ప్రవేశపెట్టిన బిసి బిల్లు జిఒలో వర్గీకరణ మాటే లేకపోవడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. తామిచ్చిన వాగ్దానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కేరళ వయోజన విద్యావిధానం దేశానికి ఆదర్శం

- యువతే మా బ్రాండ్ అంబాసిడర్లు
- కెసి వేణుగోపాల్ పొంథువల్ (ఎంపి) మెరిట్ అవార్డులది ప్రత్యేక స్థానం
- సిఎం రేవంత్‌రెడ్డి

పొంథువల్ (ఎంపి) మెరిట్ అవార్డు అందజేస్తున్న సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేరళ ప్రభుత్వం అనుసరిస్తోన్న వయోజన విద్యావిధానం దేశానికే ఆదర్శనీయమని, ఆ రాష్ట్రం విద్యకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి కొనియాడారు. యువత తమ బ్రాండ్ అంబాసిడర్లు అని పేర్కొన్నారు. కేరళలోని అలప్పుజలో మెరిట్ విద్యార్థులకు అందించే ఎంపి మెరిట్ అవార్డ్-2025 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కెసి వేణుగోపాల్ తన నియోజకవర్గంతోపాటు కేరళ రాష్ట్రానికే కాకుండా యావత్ దేశంలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి, మైనారిటీ, ప్రత్యేకించి మహిళలు, పిల్లల న్యాయం కోసం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్నారని కొనియాడారు. పొంథువల్ (ఎంపి) మెరిట్ అవార్డు దేశంలోనే చాలా ప్రత్యేకంగా నిలుస్తోందన్నారు. ఈ ఏడాది వంద శాతం ఫలితాలను సాధించిన 150 పాఠశాలల్లోని దాదాపు 3,500లకుపైగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవార్డు అందించడం గొప్ప పరిణామని తెలిపారు. విద్య అనేది ప్రతిఒక్కరికీ లభించిన ఒక గొప్ప బహుమతి, గొప్పశక్తి అని విశ్వసిస్తానని తెలిపారు. తెలంగాణలోనూ విద్యపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన 55 రోజుల్లో 11,055 టీచర్ పోస్టులను భర్తీ చేశామని, కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా వంద నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లను నిర్మిస్తున్నామని తెలిపారు. 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ల ఎకానమీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్న తీరును వివరించారు. యువతలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేసి దానికి ఆనంద్ మహీంద్రను చైర్మన్‌గా నియమించామని తెలిపారు. ఐటిఐలను ఎటిసిలుగా అప్‌గ్రేడ్ చేశామన్నారు. ఒలింపిక్స్ లక్ష్యంగా స్పోర్ట్స్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ అకాడమీని ఏర్పాటు చేసుకుంటున్నామని తెలిపారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను తెలంగాణ నుంచి పోటీ చేయాలని కోరామని, అయితే, వారు కేరళలను ఇంటిగా, కర్మభూమిగా ఎంచుకున్నారని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం కలిసికట్టుగా పోరాడాల్సిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు. 2026లో కేరళలో జరిగే ఎన్నికలు దేశ భవిష్యత్తును నిర్ణయించేవన్నారు.

21 ఏళ్ల వయస్సు ఐఎఎస్‌లు జిల్లాలను సమర్థవంతంగా నడుపుతున్నప్పుడు యువత ఎమ్మెల్యేలుగా ఎందుకు పోటీ చేయకూడదని ప్రశ్నించారు. 21 ఏళ్ల యువతకు ఎమ్మెల్యేలుగా పోటీ చేసే హక్కు కల్పించాలన్నారు. యువశక్తిని నమ్ముకుని కాంగ్రెస్ పోరాటం సాగిస్తోందన్నారు. దేశంలో ప్రజల హక్కుల కోసం కాంగ్రెస్ పోరాడుతోందని, బీహార్‌లో ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ పోరాటం చేస్తున్నారని వివరించారు.

బురద రోడ్లను పరిశీలిస్తున్న ఆనగంటి వెంకటేశ్ తదితరులు

సమస్యల వలయంలో గ్రామాలు

- ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తం : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రత్యేక అధికారుల పరిపాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయని, గ్రామ పంచాయతీలో నిధులు లేక సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్, యాదాద్రి జిల్లా అధ్యక్షులు పల్లె మధుకృష్ణ అన్నారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి గ్రామంలో డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో గ్రామంలో స్థానిక సమస్యలపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలనలో నిధులు లేక గ్రామాల అభివృద్ధి కుంటుపడిందన్నారు. గ్రామంలోని 10వ వార్డులో అండర్ డ్రయినేజీ లేక మురికి నీరు రోడ్ల మీదికి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎనిమిదేండ్ల కింద ఎస్‌సి కమ్యూనిటీహాల్, గౌడ కమ్యూనిటీ హాల్‌కు శంకుస్థాపన చేసి పిల్లర్ల వరకు నిర్మాణం చేసి మధ్యలోనే ఆపివేశారన్నారు. అలాగే, ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవనాన్ని అసంపూర్తిగా నిర్మాణం చేసి వదిలేశారని తెలిపారు. కూరగాయల మార్కెట్, గ్రంథాలయం పనులు పూర్తయినా ప్రారంభించలేదని అన్నారు. కొన్ని వార్డుల్లో సీసీరోడ్డు నిర్మాణం లేక ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. గ్రామంలో పేరుకుపోయిన సమస్యలపై స్థానిక ఎమ్మెల్యే స్పందించి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ మండల కార్యదర్శి గుడ్డేటి సూర్జిత్, జిల్లా కమిటీ సభ్యులు రత్నం శ్రీకాంత్, గండని లక్ష్మీపతి, నత్తి నరేష్, గ్రామనాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల్ని తగ్గించండి

- కేడర్లను కుదించండి
- వైద్య విధానపరిషత్ వైద్యారోగ్యశాఖలో విలీనం
- ఆరోగ్యశాఖ సంస్కరణపై 'ఆస్కీ' నివేదిక



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూలిగే నక్కపై తాటిపండు పడడం అంటే ఇదే! రాష్ట్రంలో ప్రజావసరాలకు సరిపడా వైద్య సౌకర్యాలు లేవనేది జగమెరిగిన సత్యం. కానీ ఆరోగ్యశాఖలో సంస్కరణల పేరుతో అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఆస్కీ) దీనికి భిన్నంగా రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. వైద్యారోగ్యశాఖలో ఇప్పుడీ రిపోర్టు చర్చనీయాంశంగా మారింది. ఆస్కీ ప్రతిపాదనలపై ఉద్యోగులు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగుల సంఖ్యను తగ్గించి, క్యాడర్ పోస్టుల్ని కూడా కుదించాలనే ప్రతిపాదనల్ని వారు తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నారు. వైద్యారోగ్య సేవల్లో సరైన ప్రమాణాలు అమలయ్యేందుకు ప్రపంచ ఆరోగ్యసంస్థ, నేషనల్ హెల్త్ మిషన్, ఇండియన్ హెల్త్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్స్ వంటివి క్యాడర్ స్ట్రెంత్‌కు సంబంధించి అనేక సూచనలు చేశాయి. జనాభా ఆధారంగా బెడ్‌ల సంఖ్య, డాక్టర్లు, నర్సులు, పారామెడికల్ సిబ్బంది నిష్పత్తిని ఆయా సంస్థలు ధృవీకరించాయి. మెరుగైన వైద్య సేవలందించేందుకు అభివృద్ధి చెందిన దేశాలు ఈ సిఫారసుల్నే ప్రామాణికంగా పాటిస్తున్నాయి. కానీ 'ఆస్కీ' దీనికి భిన్నంగా నివేదికలో పేర్కొంది. ప్రస్తుతం ఉన్న 117 క్యాడర్లను 81కు కుదించాలని సిఫారసు చేసింది. డీఈవో, డైటీషియన్, ఈసీజీ టెక్నీషియన్లు, నర్సింగ్ ఆఫీసర్ల సంఖ్యను తగ్గించింది. ఆయా కేడర్ పోస్టుల్ని కుదించుకోవాలని సూచించింది. అలాగే కొన్ని ఉద్యోగాలను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్‌లోనే కొనసాగించాలని ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న 12,589 మంది ఉద్యోగుల సంఖ్యను 11,662కు తగ్గించాలని సిఫారసు చేసింది. దీనిపై వైద్యారోగ్యశాఖ ఉద్యోగులు భగ్గుమంటున్నారు. ఇప్పటికే ఉన్న ఉద్యోగులపై తీవ్రమైన పనిఒత్తిళ్లు పెరుగుతున్నాయనీ, పెరిగిన జనాభాకు అనుగుణంగా వైద్యసౌకర్యాలు లేని సమయంలో 'ఆస్కీ' ఈ తరహా సిఫారసులు ఏంటని ప్రశ్నిస్తున్నారు. అయితే తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టివివిపి)ని డైరెక్టర్ ఆఫ్ సెకెండరీ హెల్త్‌గా మార్చే ప్రతిపాదనను స్వాగతించారు. దీనికి సంబంధించిన విధివిధానాలు రూపొందించాలని 'ఆస్కీ' ప్రతిపాదించింది. ఈ నివేదికపై ఇప్పటికే వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష నిర్వహించారు. నివేదికలో పేర్కొన్న అంశాల ఆధారంగా ఆయా విభాగాలవారీగా నివేదికలు ఇవ్వాలని కోరారు. అదే సమయంలో తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని వివిధ క్యాడర్లకు సంబంధించిన దాదాపు 11 వేల మంది సిబ్బంది ప్రభుత్వాస్పత్రుల్లో పని చేస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆయా ఆస్పత్రుల్లో వసూలు చేసే యూజర్ చార్జీల ద్వారా వేతనాలు ఇచ్చేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి సిఎం డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి యూజర్ చార్జీలను రద్దు చేసి, ఉద్యోగులకు గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారా జీతాలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశారు. అప్పటి నుంచి వీరందరికీ గ్రాంట్ ఇన్ ఎయిడ్ ద్వారానే జీతాలు అందుతున్నాయి. అయితే తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని వారు చాలాకాలంగా కోరుతున్నారు. టివివిపి పరిధిలో జిల్లా ఆస్పత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, మెటర్నల్ చైల్డ్ హెల్త్ సెంటర్ల ద్వారా వీరంతా వైద్య సేవలందిస్తున్నారు. అయితే వారిని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ సెకండరీ హెల్త్‌గా మార్చాలనే ప్రతిపాదనల పట్ల ఉద్యోగులు సిఎం రేవంత్‌రెడ్డి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు.

అందర్నీ రెగ్యులరైజ్ చేయాలి -బైరిపాక శ్రీనివాస్

వైద్య విధాన పరిషత్‌లో దాదాపు 20 ఏండ్లకుపైగా కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన సేవలందిస్తున్న వారందరిని బేషరతుగా రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్, హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) అనుబంధ వైద్య విధాన పరిషత్ విభాగం రాష్ట్ర కార్యదర్శి బైరిపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. టివివిపిని సెకెండరీ హెల్త్ సర్వీసెస్‌గా అప్‌గ్రేడ్ చేస్తుండటం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అయితే ఆస్కీ నివేదికలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు అదే హోదాలో రిటైర్ అయ్యేలా సిఫారసు చేయడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. క్యాడర్ స్ట్రెంత్‌ను తగ్గించొద్దనీ, ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్డ్ ప్రకారమే విధాన నిర్ణయాలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

శ్రీశ్రీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆనందచారి తదితరులు

ఆరుద్ర సాహిత్యం జనహితం

- తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరుద్ర సాహిత్యం జనహితాన్ని ప్రతిబింబిస్తుందని తెలంగాణ సాహితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఆనందాచారి అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని ఎంహెచ్‌భవన్‌లో తెలంగాణ సాహితి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఆరుద్ర శతజయంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీనియర్ కవి, రచయిత సత్యభాస్కర్, ఆనందాచారి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆనందాచారి మాట్లాడుతూ... కవి, రచయిత, అనువాదకుడు, గేయరచయిత, నాటకకర్త, ప్రచురణకర్త, తెలుగు సాహిత్య నిపుణుడు అయిన ఆరుద్ర, తన రచనల ద్వారా సామాన్యులను, ప్రజాసామాన్యాన్ని ప్రభావితం చేశారని తెలిపారు. ఆయన అభ్యుదయ రచయితగా ఉంటూ ప్రజల జీవితాలను ప్రతిబింబించే రచనలు చేశారని గుర్తుచేశారు. ఆయన సూచించిన అభ్యుదయబాటలోనే నేడు తెలంగాణ సాహితి ప్రయాణిస్తున్నదని చెప్పారు. కార్యక్రమంలో తెలంగాణ సాహితి రాష్ట్ర ఉపాధ్యక్షులు అనంతోజు మోహన్‌కృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శి సలీమ, రంగారెడ్డి జిల్లా నాయకులు, సీనియర్ కవి, రచయిత బండి సత్తన్న, హైదరాబాద్ నగర కార్యానిర్వహక కార్యదర్శి శరత్ సుదర్శి, నాయకులు సయ్యద్ ముజాహిద్ అలీ, అజయ్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

నాలుగు బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మున్సిపల్, పంచాయతీరాజ్ చట్ట సవరణలతో పాటు మరో రెండు బిల్లులను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఆదివారం శాసనసభలో మున్సిపల్ చట్ట సవరణ, ఇస్నాపూర్ మున్సిపాల్టీ విస్తరణ, ఇంద్రేశం, జిన్నారం మున్సిపాల్టీల ఏర్పాటు బిల్లులను ముఖ్యమంత్రి తరపున అసెంబ్లీ వ్యవహారాల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రవేశపెట్టారు.

పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లును ఆ శాఖ మంత్రి సీతక్క, అల్లోపతిక్ ప్రయివేట్ మెడికల్ కేర్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ రద్దు బిల్లును వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సభలో ప్రవేశ పెట్టారు. అనంతరం వీటిపై జరిగిన స్వల్ప కాలిక చర్చలో కాంగ్రెస్‌తో పాటు బీఆర్‌ఎస్, బీజేపీ, సీపీఐ. ఎంఐఎం పార్టీలు తమ అభిప్రాయాలను వెల్లడించాయి. ప్రభుత్వం సభలో ప్రవేశపెట్టిన నాలుగు బిల్లులకు అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించడంతో ఏకగ్రీవంగా అమోదం పొందాయి.

చర్చ అసెంబ్లీలో కాదు...పార్లమెంటులో జరగాలి

- సీఎంకు దమ్ముంటే జంతర్‌మంతర్ వద్ద ఆమరణ దీక్ష చేయాలి
- బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్ని పార్టీలు కలిసి రావాలి: కూనంనేని
- బిసి రిజర్వేషన్లపై శాసనసభలో వాడివేడి చర్చ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్ని రాజకీయ విమర్శలు చేసినా బిసి రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత రాదంటూ ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శలు గుప్పించారు. శాసనసభ వర్షాకాల సమావేశాల్లో రెండో రోజైన ఆదివారం పురపాలక, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో కెటిఆర్ మాట్లాడుతూ ఈ బిల్లు మన పరిధిలో లేదని తేల్చి చెప్పారు. 42 శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ ఇరుక్కుపోయిందని, అందుకే తమ పరిధిలోలేని అంశంపై చట్టం తీసుకొచ్చి బిసిలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎంతమంది ఉంటే అంత ప్రాతినిధ్యం ఉండాలని రాహుల్ గాంధీ చెబుతున్నారని, అలాంటప్పుడు 42 శాతం రిజర్వేషన్ల అంశాలపై పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మార్చిలో బిల్లు పాస్ చేసిందానికి, ప్రస్తుత బిల్లుకు తేడా ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పుడు చేయని రాష్ట్రపతి, గవర్నర్ ఇప్పుడు సంతకాలు ఎలా చేస్తారని నిలదీశారు. ప్రభుత్వాలు చేసిన చట్టాలు లొసుగులు లేకుండా చేసుకుంటే మంచిదని సూచించారు. కేవలం బిసి డిక్లరేషన్లు ఇచ్చి వదిలేస్తే సరిపోదని, డెడికేషన్ ఉండాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. బిల్లుకు సంబంధించి ఢిల్లీలో ప్రధానమంత్రి దగ్గర అఖిలపక్షానికి సమయం తీసుకోవాలని, తాము కూడా మద్దతిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీలో చెప్పులు ఎత్తుకొనిపోతారని రేవంత్ అంటున్నారని, ఇలా మాట్లాడిన తర్వాత ఎవరు అపాయిమెంట్ ఇస్తారని ప్రశ్నించారు. బిసిల రిజర్వేషన్లు తెలంగాణలో ఆమోదం పొందకముందే ఇక్కడి ప్రజల సొమ్ముతో బీహార్లో ముఖ్యమంత్రి తన ఫొటోలతో పత్రిక ప్రకటనలు ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సిఎం మాట తీరు మార్చుకోవాలని సూచించారు. విధానపరంగా ఎన్ని విభేదాలున్నా తమ పార్టీ మొదటి నుంచి బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. బిసి బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు కెటిఆర్ ప్రకటించారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రవేశపెట్టిన సవరణ బిల్లుకు బిజెపి సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ఆ పార్టీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బిసి డిక్లరేషన్‌పై సభలో చర్చ జరగాలని లయన డిమాండ్ చేశారు.

ద్వంద్వ విధానాలు వీడండి: కూనంనేని

ద్వంద్వ విధానాలు వీడి బిసి రిజర్వేషన్ల పోరాటంలో కలిసి రావాలని బిఆర్‌ఎస్, బిజెపిలకు సిపిఐ శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఒకవైపు బిసి బిల్లుకు సంపూర్ణ మద్దతిస్తున్నామని చెబుతూనే 9వ షెడ్యూల్‌లో చేర్చకపోతే బిల్లుకు చట్టబద్ధత రాదని అంటున్నారని విమర్శించారు. ఈ రకంగా రెండు పార్టీలు పూటకోమాట మాట్లాడుతున్నాయన్నారు బిసి రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని చేసే పోరాటానికి బిజెపి, బిఆర్‌ఎస్ నేతలు ఎందుకు మద్దతు పలకడం లేదని ప్రశ్నించారు. సభలో జరుగుతున్న చర్చ చూస్తుంటే తెరమీద సినిమాలు గుర్తొస్తున్నాయన్నారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడమనేది విప్లవాత్మకమైన ముందడుగని కూనంనేని అన్నారు. ఈ పోరాటంలో అన్ని పార్టీలూ కలిసి రావాలని కోరారు.

కేంద్రం వల్లే ఎరువుల సంక్షోభం

- ఎస్‌వికె వెబినార్‌లో టి. సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాల వల్లే ఎరువుల సంక్షోభం వచ్చిందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. సాగర్ అన్నారు. ఎరువుల సమస్యను పరిష్కరించే దిశగా కేంద్రం ఆలోచన చేయడం లేదని విమర్శించారు. రాష్ట్రానికి కేటాయించిన యూరియాను కేంద్రం క్రమంగా తగ్గించిందన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వికె) ఆధ్వర్యంలో 'ఎరువుల కొరత-కారణాలు, పరిష్కారం' అనే అంశంపై వెబినార్ జరిగింది. దీనికి ఎస్‌వికె మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో తీవ్రమైన ఎరువుల కొరత వెంటాడుతోందని తెలిపారు. కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం, బిజెపి ఎంపిలేమో రాష్ట్ర ప్రభుత్వంపై పరస్పరం విమర్శలు చేసుకుంటున్నారు తప్ప, సమస్యకు పరిష్కారం చూపడం లేదన్నారు. కేంద్రం ఎరువుల వినియోగాన్ని తగ్గించడం, నానో ఎరువులను ఉపయోగించాలనడం, సేంద్రియ ఎరువులకు ప్రోత్సాహకాలు ఇస్తామని చెప్పడం తదితర కారణాలతో ఎరువుల సంక్షోభం వచ్చిందని వివరించారు. మొత్తంగా ఎరువుల వాడకాన్ని తగ్గిస్తే... ఆ మిగులును రాష్ట్రాలకు ఇస్తామంటూ కేంద్రం చెప్పిందని తెలిపారు. ఆ రకంగా ఎరువులను తగ్గించాలనే నిర్ణయంతో రైతులకు కష్టాలు వచ్చాయన్నారు. 2023-24 రెండు లక్షల కోట్ల సబ్సిడీ ఉంటే, ఇప్పుడు మాత్రం రూ.1.60 లక్షల కోట్లకు తగ్గించిందని తెలిపారు. ఎరువుల అంశం రాష్ట్రాల పరిధిలో లేదన్నారు. ఆయా రాష్ట్రాలకు కేంద్రమే కేటాయింపులు చేస్తోందని తెలిపారు. రాష్ట్రానికి తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల ఇస్తామని కేంద్రం అంగీకరించిందన్నారు. ఏప్రిల్, మే, జూన్, జూలై మాసాల్లో రాష్ట్రానికి రావాల్సిన యూరియాను క్రమంగా తగ్గించుకుంటూ వస్తోందని తెలిపారు. ఫలితంగా మొత్తంగా 2.98 లక్షల మెట్రిక్ టన్నుల లోటు ఏర్పడిందన్నారు. వర్షాలు సకాలంలో కురువడంతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం కూడా పెరిగిందన్నారు. దీంతో ఒకేసారి ఎరువుల అవసరం ఏర్పడిందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ కూడా జిల్లాల డిమాండ్‌కు అనుగుణంగా ఎరువుల పంపిణీపై ప్రణాళిక రూపొందించలేదని ఆయన విమర్శించారు. యూరియా సంక్షోభం వచ్చినప్పుడు ప్రభుత్వం రైతు సంఘాలతో మాట్లాడితే బాగుండేదన్నారు.

మోటార్ సరిచేస్తూ విద్యుద్ఘాతంతో రైతు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారీ వర్షాలకు మత్తడి నుంచి బయటపడిన బోర్ మోటార్‌ను సరిచేస్తుండగా.. ప్రమాదవశాత్తు విద్యుద్ఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ ఘటన సిద్దిపేట జిల్లా తొగుట మండలం చందాపూర్‌లో ఆదివారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చంద నర్సయ్య (54) ఆదివారం కూడవెల్లి వాగు పెద్ద మత్తడి వద్ద తన పంటపొలానికి నీరు పెట్టడానికి వెళ్లారు. ఐదు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు వాగు పొంగిపొర్లడంతో వాగు మత్తడిలో ఉన్న మోటార్ బయటపడింది. గమనించిన రైతు మోటార్‌ను సరి చేస్తుండగా.. పక్కనే ఉన్న మోటార్ వైర్ తగిలి విద్యుద్ఘాతానికి గురై మృతి చెందాడు. మృతుని భార్య రెండేళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉండగా.. అందరికీ పెళ్లిళ్లు అయ్యాయి.

శాసనసభ నుంచి బిఆర్‌ఎస్ వాకౌట్

- పిసి ఘోష్ కమిషన్ నివేదిక చెత్తబుట్టలో...

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాళేశ్వరం ప్రాజక్టుకు సంబంధించి జస్టిస్ పిసి ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదికపై ఆదివారం అసెంబ్లీలో చర్చ కొనసాగుతున్న సమయంలోనే అధికార కాంగ్రెస్, బిఆర్‌ఎస్ మధ్య మాటల యుద్ధం నడిచింది. జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక ప్రతులను బిఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు చించివేశారు. లాబీల్లో భారీగా మార్షల్స్ మోహరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నేత ఛాంబర్‌లో సమావేశం అనంతరం ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా సభ నుంచి వాకౌట్ చేశారు. బయటకు వచ్చి ప్రభుత్వం తీరుకు వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అసెంబ్లీ నుంచి నడుచుకుంటూ వెళ్లి గన్‌పార్కు వద్ద నిరసన తెలిపారు. పిసి ఘోష్ కమిషన్ నివేదికను చెత్తబుట్టలో వేశారు.

రంగారెడ్డి జిల్లాలో దారుణ హత్య

- గొడ్డలితో నరికి చంపిన దాయాదులు
- 11 గుంటల భూమి వివాదమే కారణం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం దండుమైలారంలో ఆదివారం దారుణ హత్య జరిగింది. 11 గుంటల భూమి కోసం దాయాదుల మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో ఒక గ్రూపు గొడ్డలితో దాడికి పాల్పడ్డగా.. ఒక వ్యక్తి మృతిచెందారు. మరో మహిళ పరిస్థితి విషమంగా ఉంది. పలువురికి గాయాలవ్వడంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దాంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. దండుమైలారంకు చెందిన గుడేటి జంగయ్యకి చెందిన సర్వేనెంబర్ 156, 158, 159లో 18.12 ఎకరాల భూమి ఉంది. ఆయనకు గుడేటి నరసింహ, గుడేటి మల్లయ్య, గుడేటి యాదయ్య, గుడేటి జంగయ్య అనే నలుగురు కొడుకులున్నారు. ఒక్కో భాగానికి నాలుగు ఎకరాల 23 గుంటల భూమి రావాల్సి ఉంది. గుడేటి మల్లయ్య, గుడేటి జంగయ్యకు 11 గంటల భూమి తక్కువగా వచ్చింది. గుడేటి నరసింహ, గుడేటి యాదయ్యకు అదనంగా 11 గుంటల భూమి ఉంది. ఈ విషయమై మూడేండ్లుగా వారి మధ్య గొడవ కొనసాగుతోంది. ఇటీవల ఇరువురు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. కాగా గుడేటి మల్లయ్య, గుడేటి జంగయ్య కుమారులు ఈ భూమి విషయమై నరసింహ, యాదయ్య వారసులను అడుగుతూనే ఉన్నారు. కాగా ఆదివారం నరసింహ, యాదయ్య వారసులు సదరు వివాదాస్పదమైన భూమిలోకి వెళ్లి నాట్లు వేశారు. ఈ విషయం తెలుసుకున్న మల్లయ్య, జంగయ్య వారసులు బాలరాజు (40), ధనరాజు, వెంకటరాజు, పావని, మంజుల వారిని అడ్డుకునేందుకు అక్కడకు వెళ్లారు. దాంతో ఒక్కసారిగా నరసింహ, యాదయ్య వారసులైన బాలరాజు, శ్రీశైలం, యాదయ్య, లింగస్వామి, ప్రసాద్, పద్మ, అర్చన, దేవకమ్మ, పారిజాత కలిసి బాలరాజుపై గొడ్డలతో దాడి చేశారు. విచక్షణారహితంగా నరికి చంపారు. బాలరాజుపై జరుగుతున్న దాడిని అడ్డుకోబోయిన అతని తమ్ముని భార్య మంజులపై సైతం గొడ్డలితో దాడి చేశారు. అలాగే, వెంకటరాజు, పావనిపై సైతం దాడికి దిగారు. ఈ దాడిలో గుడేటి బాలరాజుకు తీవ్ర గాయాలవడంతో ఇబ్రహీంపట్నంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. మంజుల పరిస్థితి విషమంగా ఉంది. గాయాలపాలైన వారు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో బాధిత కుటుంబసభ్యులు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు తెలిపారు. కాగా, గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఏసీపీ సారథ్యంలో పికెటింగ్ ఏర్పాటు చేశారు. అలాగే, ఈ దాడిలో తీవ్రంగా గాయాలపాలై చికిత్స పొందుతున్న ఆస్పత్రుల వద్ద కూడా పికెటింగ్ కొనసాగుతోంది.

ఇసి శేఖర్‌గౌడ్‌పై కేసు నమోదు చేయాలి

దాయాదుల దాడిలో మృతి చెందిన మల్లయ్య కుమారుడు బాలరాజు హత్యలో కీలక పాత్రదారి అయిన ఈసీ శేఖర్‌గౌడ్‌ను అరెస్టు చేయాలని మృతుని బంధువులు డిమాండ్ చేశారు. ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రి ఎదుట బాలరాజు మృతదేహాన్ని తరలించకుండా వాహనాన్ని అడ్డుకున్నారు. ఈ భూ వివాదం తెగకుండా నిందితుని పక్షాన ఈసీ శేఖర్‌గౌడ్ హత్యకు ఉసికొల్పాడని ఆరోపించారు. ఎసిపి కెపివి రాజు జోక్యం చేసుకొని ఆందోళనకారులతో చర్చించడంతో విరమించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.

నిమ్స్‌లో చిన్నారులకు ఉచిత గుండె ఆపరేషన్లు

- బ్రిటన్ వైద్య బృందం ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 21 వరకు నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజాం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో పిల్లల కోసం బ్రిటన్ వైద్య బృందం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గుండె శస్త్రచికిత్స శిబిరం నిర్వహించనున్నట్టు నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. ఈ శిబిరం ఈ నెల 1 నుంచి 21వ తేదీ జరుగుతుందనీ అన్నారు. పుట్టుకతో గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న పిల్లలను ఈ శిబిరంలో పరీక్షించి, అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తారని తెలిపారు. ఈ శస్త్రచికిత్సలకు అయ్యే ఖర్చును రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి (సిఎంఆర్‌ఎఫ్) ద్వారా భరిస్తారని వివరించారు. నిమ్స్ పాత భవనం మొదటి అంతస్తు సిటివిఎస్ కార్యాలయంలో డాక్టర్ అమరేష్‌రావు, డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ గోపాల్‌ను మంగళ, గురు, శుక్రవారాల్లో ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సంప్రదించవచ్చని తెలిపారు. పేషెంట్లు వారి పూర్వపు రిపోర్టులు, సిటీ స్కాన్ రిపోర్టులను రెఫరెన్స్ కోసం తీసుకురావాలని కోరారు.